క్లుప్తంగా

9న ఆర్‌సీపీ ఆవిర్భావ వేడుకలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈనెల 9న నిర్వహించనున్న రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీ) 7వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌సీపీ ఏర్పడినప్పటి నుంచి జిల్లాలో ఉక్కు పరిశ్రమ సాధన కోసం అనేక దీక్షలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు లింగమూర్తి, మక్బూల్‌బాష తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెబాట

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం వీడి తమ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెబాట పడతామని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన సామూహిక నిరాహార దీక్షా శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు తమకు కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. ఆశాలను సచివాలయాలకు బదిలీ చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, నాగ సుబ్బారెడ్డి, కేసీ బాదుల్లా పాల్గొన్నారు.

పోలీసు ఆరోగ్య భద్రత స్కీం ప్రారంభం



పోలీసు ఆరోగ్య భద్రత స్కీం ప్రారంభిస్తున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్

కడప రూరల్: కడప నగరంలోని అరుణాచల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో గురువారం జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ పోలీసు ఆరోగ్య భద్రత స్కీం ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, మెడికల్ ఐసీయు, జనరల్ వార్డ్ తదితర విభాగాలను పరిశీలించారు. ఇక్కడ లభిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా అందుతున్న ఉచిత వైద్య సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు.. ఆసుపత్రిలో లభిస్తున్న ఆధునిక వైద్య సేవలపై ప్రశంసించారు. పోలీసు శాఖ సిబ్బందికి అత్యుత్తమ వైద్య సేవలు అందించి వారి ఆరోగ్య భద్రతకు పాటుపడాలని ఎస్పీ కోరారు. తమ ఆసుపత్రిలో లభిస్తున్న వైద్య సేవలను డాక్టర్ నిరంజన్‌రెడ్డి, డాక్టర్ మమతేశ్వరి ఎస్పీకి వివరించారు.

నేడు సెమినార్

వైవీయూ : కడప నగరం ఆర్‌టీఓ ఆఫీసు సమీపంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉదయం 10 గంటలకు 'ఇన్నోవేటివ్ ఛేంజస్ ఇన్ ఎడ్యుకేషన్, హెల్త్ అండ్ వెల్ఫేర్ – సస్టెనబుల్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్' సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఓపన్ మైండ్స్ సొసైటీ అధ్యక్షుడు డా. ఎస్. రాజశేఖరరెడ్డి తెలిపారు. ఈ సెమినార్‌లో అన్నమాచార్య విద్యాసంస్థల చైర్మన్ సి. గంగిరెడ్డి, వైవీయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య జి. గులాంతారీఖ్, వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు డా. ఎన్. ఈశ్వరరెడ్డి, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రాఘవరెడ్డి, ఆకాశవాణి డైరెక్టర్ జయసింహ తదితరులు ఉపన్యసించనున్నట్లు తెలిపారు.

రేపు పూర్వ విద్యార్థుల సమావేశం

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఈనెల 9వ తేదీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. కళాశాల ఏర్పాటై 75 సంవత్సరాలు పురస్కరించుకుని వజ్రోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి కె. శివరాంను 8639887801 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మట్కా బీటర్లు అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని నాగరాజుపేటలోని సినిమా థియేటర్స్ సమీపంలో మట్కా రాస్తున్న ఇద్దరిని సీఐ సి. భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐడీపార్టీ హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, కానిస్టేబుల్ గోపి, శివ, కిరణ్ అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో కడప నగరం చెమ్మూమియాపేటకు చెందిన షేక్ మహ బూబ్‌బాషా, రవీంద్రనగర్‌కు చెందిన షేక్ ఖాజావలీ వున్నారు. వీరి వద్ద నుంచి రూ.20,470 నగదుతో పాటు, నాలుగు మట్కా స్లిప్‌లు స్వాధీనం చేసుకున్నారు.

అలరించిన నృత్యాంజలి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో భాగంగా వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన అతిథులు, పరిశోధకులకు జిల్లా సంస్కృతి, సంప్రదాయాలను, రాష్ట్రంలోని ప్రాముఖ్యత కలిగిన నృత్యరీతులను పరిచయం చేస్తూ గురువారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు, సాహసకృత్యాలు ఆహుతులను అలరించాయి. సదస్సు కన్వీనర్ ఆచార్య పి.ఎస్. షావలీఖాన్ ఆధ్వర్యంలో ఈ నృత్య ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు.

గోవిందా.. హరి గోవిందా..

ఘనంగా ప్రారంభమైన శ్రీవారి పూజలు



ఎదుర్కోలు ఉత్సవానికి స్వామిని తెస్తున్న భక్తులు



ఎదుర్కోలు ఉత్సవానికి అమ్మవార్లను తెస్తున్న మహిళలు

కడప కల్చరల్ : కడప మున్సిపల్ స్టేడియంలో గోవిందమాల భక్తబృంద సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం అంగరంగ వైభవంగా శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవ పూర్వాంగ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేలాది మంది భక్తుల సమక్షంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఎదుర్కోలు ఉత్సవాలు ఉత్సాహ భరితంగా సాగాయి. తొలుత స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. గోవిందమాల దీక్షలో ఉన్న భక్తులు, తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ పూజలకు హాజరయ్యారు.

వేదోక్తంగా..

ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ఉదయం సుప్రభాత, తోమాల సేవలు నిర్వహించి అర్చనలు చేశారు. అనంతరం ఆ ప్రాంగణంలో గోమాతకు పూజలు నిర్వహించి ఉత్సవర్లకు అభిషేకం, అలంకారాలు నిర్వహించారు. మధ్యాహ్నం తిరుప్పావడ, అష్టాదళ పాద పద్మారాధన నిర్వహించారు. భక్తుల గోవింద నామ స్మరణల మధ్య ఈ కార్యక్రమం సాగింది. సాయంత్రం కుంకుమార్చన చేశారు. అర్చకులు అనంతాచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి మాతలను తొలుత విశేష అలంకారంలో ఆ ప్రాంగణంలో ఊరేగించారు. అనంతరం స్వామిని కూడా ఊరేగింపుగా కల్యాణ వేదికపైకి తెచ్చారు. ఈ సందర్భంగా వారిని ఎదురెదురుగా కొలువుదీర్చి ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. వేద పండితులు హయగ్రీవాచారి ఈ కార్యక్రమంలోని ఆధ్యాత్మిక విశేషాలను తెలుపుతుండగా, రెండు గంటల సేపు ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదానం చేశారు.

నేడు కల్యాణోత్సవం

ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీనివాస కల్యాణం, సాయంత్రం 5 గంటలకు గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించనున్నారు.



గోవిందనామ స్మరణ చేస్తున్న భక్తులు

వేడుకగా సాయుధ దళాల పతాక దినోత్సవం



పిరమిడ్ విన్యాసాలు చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్స్

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం సాయుధ దళాల పతాక దినోత్సవం పురస్కరించుకుని ఎన్‌సీసీ కేడెట్స్ వేడుకలు నిర్వహించారు. ఎన్‌సీసీ కేర్ టేకింగ్ ఆఫీసర్ విన్నీతేజ ఆధ్వర్యంలో కేడెట్స్ పిరమిడ్ విన్యాసాలు చేసి అలరించారు. అనంతరం సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ప్రజల నుంచి, అధ్యాపకులు, విద్యార్థుల నుంచి విరాళాలు సేకరించారు. అనంతరం సేకరించిన రూ.11,574 ను కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషాకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశానికి ఎనలేని సేవలందించిన సైనికుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా విరాళాలు సేకరించడం అభినందనీయమన్నారు. ఎన్‌సీసీ అధికారి విన్నీతేజ మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

భవిత కేంద్రాలను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ పాలెం నారాయణ

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవితా కేంద్రాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అన్ని రకాల వసతులను కల్పించడం జరుగుతుందని కడప ఎంఈఓ పాలెం నారాయణ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప ఎన్‌జీవోకాలనీ భవితా కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప ఎంఈఓ పాలెం నారాయణతోపాటు జిల్లా ఐఈడీ కో ఆర్డినేటర్ కేశవరెడ్డి, అసిస్టెంట్ ఐఈ కో ఆర్డినేటర్ రమణమూర్తి, అసిస్టెంట్ సిఎంఓ దశరథరామిరెడ్డి, ఏఎంఓ ధనలక్ష్మి, ఏఎల్‌ఎస్ కో ఆర్డినేటర్ విశ్వనాధరెడ్డి, జిల్లా మైనార్టీ అధికారి బ్రహ్మయ్యలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ పాలెం నారాయణ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవితా కేంద్రాలలో ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరఫిలతోపాటు పలు రకాల సేవలందుతున్నాయన్నారు. దీంతోపాటు పిల్లలకు అవసరమైన ఉపకరణాలను ప్రభుత్వం వారికి ఉచితంగా అందిస్తుందన్నారు. అనంతరం పిల్లలతో కలిసి కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్ర ఐఈఆర్టీ సిద్దారెడ్డి, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



చెన్నూరు సమీపంలో నేలకొరిగిన వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కడప అగ్రికల్చర్: తుఫాన్ కారణంగా వర్షాలకు దెబ్బతిన్న పంటలను గురువారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధనస్థాన ప్రధాన శాస్త్రవేత్తలు జాన్సన్, సునిల్‌లు వల్లూరు, చెన్నూరు, కడప మండలాలల్లో ఆయా మండల వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా వరి, మినుము, జొన్న పంటలను పరిశీలించి రైతుకు పలు సూచనలు, సలహాలను చేశారు. ముఖ్యంగా వర్షం, గాలులతో కోత దశలో ఉండి పడిపోయిన వరిపంటను పరిశీలించారు. పడిపోయిన కంకికి మొలక రాకుండా ఉండేందుకు 50 గ్రాముల ఉప్పును ఒక లీటరు నీటికి కలుపుకుని పిచికారీ చేసుకోవాలని తెలిపారు. అలాగే నల్లగింజ కాకుండా ప్రొఫికొనజోల్‌ను ఒక మిల్లీలీటరును ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. అలాగే మినుములో ఆకు మచ్చ, బూడిద, మారుకా మచ్చ తెగులు వచ్చే అవకాశం ఉందని, దీని నివారణకు 2 ఎంఎల్ హెక్సాకొనజోల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. అలాగే జొన్నపంటలో కంకికి బూజు తెగులు వచ్చే అవకాశం ఉందిని దీని నివారణకు ఒక ఎంఎల్ ప్రొఫికొనజోల్‌ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. శనగపంటకు రబ్బరు పురుగు, వేరు కుళ్లు వచ్చే అవకాశం ఉందని దీని నివారణకు 0.25 ఎంఎల్ ఫ్లూబెండ్‌మైండ్‌ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంఈఓ సురేష్‌కుమార్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'తో సమస్యల పరిష్కారం

– ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా



ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 3 డివిజన్‌లోని రామాంజనేయపురం ఆర్టీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. వెంకటసుబ్బమ్మ అనే మహిళ మాట్లాడుతూ తనకు ఇంటి స్థలం, ఇంటిని నిర్మించుకోవడానికి నగదు, వైఎస్సార్ సున్నావడ్డీ, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల ద్వారా రూ.9 లక్షల లబ్ధి కలిగిందని ఆనందం వ్యక్తం చేసింది. నాగమణి అనే మహిళ మాట్లాడుతూ గతంలో వృద్ధాప్య పింఛన్ కోసం దూరాబారం పోయి ఎన్నో వ్యయప్రయాసలకు గురయ్యే వారమని, వలంటీరు వ్యవస్థ ద్వారా ఇప్పుడు ఇంటికే తెచ్చి పింఛన్ ఇస్తున్నారని హర్షం వ్యక్తం చేసింది. ఈ ప్రభుత్వం వచ్చాక తమకు వివిధ పథకాల ద్వారా లక్షా యాభై వేల వరకూ మేలు జరిగిందని సంతోషంగా తెలిపింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, 3వ డివిజన్ ఇన్‌చార్జి ఎం. సుదర్శన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, మౌలాలి, నాగేంద్ర, మునిశేఖర్‌రెడ్డి, అర్జున్, షఫీవుల్లా, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

చికెన్ ధర తగ్గెన్

- అమాంతంగా తగ్గిన ధర
- కిలో స్కిన్ లెస్ రూ. 140, విత్ స్కిన్ కిలో రూ. 120
- లైవ్ బ్రాయిలర్ కోడి కేజీ రూ. 68
- కార్తీక మాసం, అయ్యప్ప భక్తుల ప్రభావం



కడప అగ్రికల్చర్: కార్తీకమాసం, అయ్యప్ప స్వాముల దీక్షల ప్రభావంతో చికెన్ ధర తగ్గింది. ప్రస్తుతం లైవ్ బ్రాయిలర్ కోడి కేజీ రూ. 68 కాగా, స్కిన్ లెస్ కిలో రూ. 140, విత్ స్కిన్ కిలో రూ.120 పలుకుతోంది. దీంతో వ్యాపారులు కొంత ఆందోళన చెందినా మాంసం ప్రియులు మాత్రం సంతోషంగా ఉన్నారు. కార్తీక మాసానికి ముందు స్కిన్ లెస్ కిలో రూ. 200 ఉండగా, స్కిన్ కిలో రూ. 180 ధర పలుకుతుండేది. అలాంటిది కార్తీక మాసం ప్రారంభంకాగానే చికెన్ ధర తగ్గుతూ వచ్చి కార్తీక మాసం రెండవ వారానికి పూర్తిగా ధర పడిపోయింది. కోళ్ల పెంపకందారులు దాణా ఖర్చు భరించలేక కంపెనీదారులు, రైతులు ఉత్పత్తి అయిన కోళ్లను నష్టమే అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో మార్కెట్‌కు తరలిస్తున్నారు.


సాధారణ రోజుల్లో...

కార్తీక మాసానికి ముందు మామూలు రోజుల్లో కడప నగరంలో రోజుకు 40 టన్నుల వరకు బ్రాయిలర్ చికెన్ మాంసం అమ్మకాలు జరిగేదని చికెన్ వ్యాపారస్తులు తెలిపారు. ఇదే సమయంలో ఆదివారం రోజైతే 100 టన్నులకుపైగా మాంసం అమ్ముడుపోయేదని వారు తెలిపారు. కానీ కార్తీక మాసం ప్రారంభమైన తరువాత ప్రస్తుతం రోజుకు 20 నుంచి 25 టన్నుల వరకు చికెన్ అమ్ముడుపోతోందని పలువురు వ్యాపారులు తెలిపారు.

ధర తగ్గినా..

బహిరంగ మార్కెట్‌లో చికెన్ ధరలు భారీగా తగ్గినా ఆ మేరకు విక్రయాలు మాత్రం పెరగడం లేదని పలువురు వ్యాపారులు తెలిపారు. కార్తీక మాసం కావడంతో చాలా మంది మాంసాన్ని తినడం లేదు. దీంతోపాటు కొందరు అయ్యప్ప దీక్షలో ఉండడంతో చికెన్ తినడం మానేశారు. దీంతో వ్యాపారాలు బాగా తగ్గాయని పలువురు రిటైల్ చికెన్ షాపు యజమానులు తెలిపారు.

డిమాండ్ తగ్గిపోయింది...



బహిరంగ మార్కెట్‌లో మునుపెన్నడూ లేని విధంగా చికెన్‌కు డిమాండ్ తగ్గిపోయింది. దీని వల్ల ధర బాగా పడిపోయింది. కరోనా ప్రారంభంలో ఇలాంటి పరిస్థితిని చూశాం. తరువాత బాగానే ఉండేది. కానీ ఈ ఏడాది మళ్లీ అప్పటి పరిస్థితి చూస్తున్నాం. చికెన్ ధర తగ్గడంతో రైతులు, సరఫరాదారులతో పాటు చిరు వ్యాపారులకు తీవ్రనష్టం వాటిల్లుతోంది.

– రఫిక్, హోల్‌సెల్ చికెన్ వ్యాపారి, కడప

మునగ సాగుతో ఉపాధి

కమలాపురం : మునగ తోటలు సాగు చేయడం ద్వారా ఉపాధి లభించడంతో పాటు అధిక ఆదాయం పొంద వచ్చని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని దేవరాజుపల్లెలో రైతు నరసింహారెడ్డి పొలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన నర్సరీలోని 5 వేల మొక్కలను ఆయన రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగ లోని ఆకులు, కాయల్లో మంచి పౌష్టికాహారం ఉంటుందన్నారు. ఇందులో పాల కన్నా 4 రెట్లు కాల్షియం ఎక్కువ ఉంటుందన్నారు. కమలా కన్నా 7 రెట్లు విటమిన్–సీ, క్యారెట్ల కన్నా 4 రెట్లు విటమిన్–ఏ ఎక్కువగా ఉంటుందన్నారు. అందుకు గాను రైతులందరూ తమ పొలాల గట్ల పై, అలాగే ఇళ్లల్లోని పెరట్లో మునగ చెట్లు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రఘునాథరెడ్డి, ఎంపీటీసీ చెన్నకేశవరెడ్డి, సర్పంచ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్‌ఓబీకి భూమి పూజ

కమలాపురం : పట్టణంలో రైల్వే ట్రాక్‌పై నిర్మించే రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ)కు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారని మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజల చిరకాల కోరిక తీర్చే ఆర్‌ఓబీ నిర్మాణానికి బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ వద్ద భూమి పూజ చేయడానికి ప్రజా ప్రతినిధులు వస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఖాళీగా వున్న గ్రామ వలంటీర్ పోస్టుకు అర్హులైన వారు ఈనెల 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. దుగ్గాయపల్లెలో ఖాళీగా వున్న ఈ పోస్టు ఎస్సీ జనరల్‌కు కేటాయించబడినట్లు తెలిపారు. ఈ ఏడాది జూన్ 1 నాటికి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గల 10 తరగతి లేదా దానికి సమానమైన విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 11న పరిశీలిస్తారన్నారు. 12వ తేదీన ఇంటర్వ్యూలను నిర్వహించి ఎంపిక చేస్తారని, 14న ఎంపికైన వారికి నియామక పత్రాన్ని అందచేస్తామని తెలిపారు. అర్హత, ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఇద్దరు మహిళలకు ఆటోలు మంజూరు

వల్లూరు : మండలంలోని ఇద్దరు స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉన్నతి పథకం కింద ఆటోలు మంజూరయ్యాయని ఏపీఎం శైలజ తెలిపారు. మండలంలోని తప్పెట్ల గ్రామ సమాఖ్యలోని విశ్వా స్వయం సహాయక సంఘ సభ్యురాలు ప్రశాంతికి ఆటో మంజూరైంది. మొత్తం విలువ రూ 2,75,952 కాగా లబ్ధిదారుని వాటాగా రూ 27,952 చెల్లించగా మిగిలిన రూ.2,48,000 ఎస్సీ స్పెషల్ ఉన్నతి పథకం కింద మంజూరైంది. వల్లూరు గ్రామ సమాఖ్యలోని దాస్ స్వయం సహాయక సంఘ సభ్యురాలైన లక్ష్మిదేవికి ఆటో మంజూరైంది. మొత్తం విలువ రూ 3,35,190 కాగా లబ్ధిదారుని వాటాగా రూ 33,590 చెల్లించగా మిగిలిన మొత్తాన్ని ఉన్నతి పథకం కింద మంజూరైంది. ఈ మేరకు కడపలో గురువారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ రామరాజు చేతుల మీదుగా ప్రశాంతి అనే లబ్ధిదారికి ఆటోను అందించారు.

ఉచిత శిక్షణ

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (న్యాక్)లో సీడాప్, ఏపీఎస్‌ఎస్‌డీసీ సంయుక్త సహకారంతో సర్వేయర్, సోలార్ పి.వి.ఇంజనీర్, ఫీల్డ్ ఇంజనీర్ కోర్సులలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో కూడిన ఉపాధి కల్పించనున్నట్లు న్యాక్ అకాడమి కన్‌స్ట్రక్షన్స్ ఆఫీసర్ రాకేష్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కోర్సులలో శిక్షణ పొందేందుకు 18 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు వయసు ఉండాలన్నారు. ఒక్కో బ్యాచ్‌లో 30 మంది మాత్రమే ఉంటారని తెలియజేశారు. ఇతర వివరాలకు 99851 42155, 9000517637 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రథమ చికిత్స కిట్లు పంపిణీ

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని పోస్టాఫీసు ఎదురుగా ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నగర అధ్యక్షులు ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు లయన్ ఫటాన్ ఖాదర్‌బాష మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఏమైనా అత్యవసర చికిత్స ఉంటే ఈ కిట్లు పనికొస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షర్మిలారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా

వైవీయూ: లైంగిక వేధింపులకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా పేర్కొన్నారు. గురువారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ×పనిచేసే ప్రాంతాల్లో లైంగిక వేధింపులు× అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్ శాంత మాట్లాడుతూ మహిళలు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురైతే చట్టం ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. అనంతరం పలు చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డా. జి. విజయలక్ష్మీదేవి, డా. పి. శచీదేవి, ఉమన్ ఎంపవర్‌మెంట్ కన్వీనర్ నాగరత్నమ్మ, రిజ్వాన, సుధారాణి, మంజుల, మాధవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం ఉపాధ్యాయుల వేతనాలు పెంచాలి



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న పార్ట్‌టైం ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర సమగ్రశిక్ష అభియాన్ కింద ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న డ్రాయింగ్, క్రాఫ్ట, పీఈటీ పార్ట్‌టైం ఉపాధ్యాయులకు మెరుగైన వేతనాలను పెంచాలని పార్ట్‌టైం ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కోశాధికారి బద్వేల్ చిన్న వెంకటయ్య కోరారు. ఈ విషయమై గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిని కడపలోని ఆయన కార్యాలయంలో కలిసి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్ట్‌టైం పదం తొలగించి ఒకేషనల్ ఉపాధ్యాయులుగా తమను మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్ట్‌టైం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



35వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని జేసీఎస్ కన్వీనర్ షఫీ, 35వ డివిజన్ కార్పొరేటర్ ఎస్‌ఏ షంషీర్ అన్నారు. గురువారం స్థానిక 35వ డివిజన్‌లోని నకాష్‌లో 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివప్రసాద్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పది మోడల్ పేపర్ల ఆవిష్కరణ



పదవ తరగతి మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ప్రచురించే పదవ తరగతి మోడల్ పేపర్లను గురువారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థుల శ్రేయస్సును కూడా దృష్టిలో ఉంచుకుని ప్రతి ఏడాది మోడల్ పేపర్లను ప్రచురిస్తున్నామన్నారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు రూ. 75 కే అన్ని సబ్జెక్టులు ఉండే విధంగా తయారు చేసి అందజేస్తున్నామన్నారు. మోడల్ పేపర్లు కావాల్సిన వారు కడప యూటీఎఫ్ భవన్‌లో, 9492805708 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.